క్లుప్తంగా

పెద్దింటి అమ్మవారికి గరగలు, గంగాళం సమర్పణ



ఆకివీడు పెద్దింటి అమ్మవారికి గరగలు, గంగాళం సమర్పిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక పెద్దింటి అమ్మవారికి ఐదు గరగలు, ఒక గంగాళాన్ని భక్తులు బుధవారం సమర్పించారు. స్థానిక ఈస్టుపాలెం ఎంపీపీ స్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులు కోనెల శ్రీనివాస పురుషోత్తం ఐదు గరగలు సమర్పించగా, వడలి వెంకట సత్య మల్లికార్జునరావు ఇత్తడి గంగాళంను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్ కుంకట్ల దానయ్య దంపతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఐఏఎల్ జాతీయ మహాసభలు

సాక్షి, భీమవరం: భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) 11వ జాతీయ మహాసభలు జూన్ 2 నుంచి నాలుగు రోజుల పాటు కేరళ రాష్ట్రంలోని త్రివేంద్రం నిర్వహిస్తున్నట్లు ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు చెప్పారు. బుధవారం భీమవరంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభల్లో న్యాయవాదులపై జరుగుతున్న దాడుల నివారణకు ప్రత్యేకమైన చట్టం తేవాలని, న్యాయవాదులకు ఇళ్లస్థలాలు, వెల్ఫేర్‌ఫండ్ రూ. 20 లక్షలకు పెంచాలని, జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ రూ. 10వేలుకు పెంచాలని తదితర డిమాండ్స్‌పై చర్చించనున్నట్లు రంగరావు తెలిపారు. సమావేశంలో ఐఏఎల్ జిల్లా కార్యదర్శి నెక్కంటి క్రాంతికుమార్, బండి వెంకటేశ్వరరావు, చల్లా దానయ్యనాయుడు, వైవీ ఆనంద్, అశోక్ కుమార్, మల్లుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పంటబోదెల తవ్వకం పనులు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. జగన్నాథపురం, కోమటితిప్ప, వారతిప్ప, కొత్తోట, కాళీపట్నం తూర్పు, కేపీ పాలెం నార్త్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లోని పంట బోదె తవ్వకం పనులు చేపట్టారు. బుధవారం జగన్నాథపురంలో చేపట్టిన తవ్వకం పనులతో పాటు మస్త ర్‌ను ఏపీఓ వై.శ్రీనివాస్ పరిశీలించారు.

పొగాకు వాడకాన్ని నిషేధించాలి

మొగల్తూరు: పొగాకు వినియోగించడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఒ.దినేష్ తెలిపారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మొగల్తూరులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ మాట్లాడుతూ పొగాకు వినియోగించడం వల్ల క్యాన్సర్, ఊపిరితిత్తుల సమస్యలు ఏర్పడతాయన్నారు. డాక్టర్ లీనా సుప్రియ, కిశోర్, సావిత్రి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో పారిశుద్ధ్యం పరిశుభ్రత విషయంలో కార్మికులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని పట్టణ పురపాలక సంఘ ప్రత్యేకాధికారి దాసిరాజు అన్నారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాసిరాజు మాట్లాడుతూ వచ్చేది వర్షాకాలమని పారిశుద్ధ్య పట్ల నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి స్థలాలు శుభ్రం చేయించాలన్నారు. కచ్చా డ్రైయిన్లు ఉన్న ప్రదేశంలో బ్లీచింగ్ వంటివి చల్లాలని సూచించారు. పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బిఆర్‌ఎస్ శేషాద్రి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, కుమార్ రాజా పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకుంతీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం

యలమంచిలి: కొంతేరు గ్రామంలోని శ్రీకుంతీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక కల్యాణోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ ఆధ్వర్యంలో అర్చకులు పొలమూరు మాధవాచార్యులు ఈ కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారిని పెండ్లి కుమారుని చేశారు. మధ్యాహ్నం గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి దేవేరుల కల్యాణం అంగరంగ వైభవంగా చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి దేవేరుల కల్యాణం తిలకించారు. భక్తులకు కల్యాణం అనంతరం దేవేరుల దర్శనం, తీర్థప్రసాద వితరణ చేశారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయం వద్ద ఈ నెల 11న ఆదివారం అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాస్ చెప్పారు.

చదువుతోనే ప్రతి కుటుంబానికి మంచి భవిష్యత్

పోడూరు: చదువుతోనే ప్రతి కుటుంబానికి మంచి భవిష్యత్ ఉంటుందని స్థానిక తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు అన్నారు. గుమ్మలూరు శివారు పైడావ గ్రామంలో బుధవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులంతా తమ పిల్లలను మధ్యలో స్కూల్ మాన్పించకుండా ఉన్నత చదువుల వరకు చదివించాలన్నారు.

జోరుగా.. హుషారుగా..

- వేసవి దుక్కులు దున్నుతున్న రైతన్నలు
- పంటలో తెగుళ్లు దూరం
- అధిక దిగుబడులు సాధించవచ్చంటున్న రైతన్నలు



దిరుసుమర్రు పొలంలో వేసవి దుక్కులు దున్నుతున్న దృశ్యం

భీమవరం అర్బన్: మండలంలో పంట పొలాల్లో రైతులు ట్రాక్టర్లతో వేసవి దుక్కులు దున్నుతున్నారు. ఇలా చేయడం ద్వారా దీంతో తెగుళ్ల బారిన నుంచి పంటను రక్షించుకోవడమే కాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులు అంటున్నారు. భీమవరం మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, తుమ్మగొప్పు, కొమరాడ, అనాకోడేరు, చినఅమిరం, తాడేరు, బేతపూడి, గునుపూడి, రాయలం తదితర గ్రామాలలో సుమారు 8 వేల 500 ఎకరాలలోను వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం దాళ్వా మాసూళ్లు దాదాపు ఒబ్బిడైపోవడంతో రైతులు తమ పొలాలలోని ఎత్తు పల్లాలను చదును చేసుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. అలాగే వేసవి కావడంతో రైతులు తమ పొలాలను ట్రాక్టర్ల సహాయంతో దున్నుతూ నేలను పైకికిందికి కలయబెడుతున్నారు. ఇలా చేయడం వల్ల నేలల్లో పోషకాలు పైకి రావడంతో దిగుబడి పెరుగుతుందని రైతులు చెబుతున్నారు.

వేసవి దుక్కులతో తెగుళ్ల దూరం

వ్యవసాయ పంటలో కాండం తొలుచు పురుగులు, ఆకు ముడత పురుగులు, కాండం కుళ్లు తెగుళ్లకు కారకాలైన పురుగులు గుడ్లు పొదిగి నేలల్లో ఉంచడం వల్ల తదానంతరం వచ్చే పంటలో మళ్లీ ఆ తెగులు వ్యాప్తి చెంది పంట నాశనం చేస్తాయని రైతులు చెబుతున్నారు. వేసవిలో దుక్కులు దున్నడం వల్ల ఆ తెగులు జాతికి చెందిన బీజాలు వేడికి చనిపోవడం లేదా పక్షులు తినడంతో పంట తెగులు వ్యాప్తి తక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా మొండి జాతికి చెందిన గడ్డిమొక్కలు ఇతర కలుపు మొక్కల మూలాలు ఎండదెబ్బకు ఎండిపోతాయని రైతులు చెబుతున్నారు. దీంతో వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా నేల సార వంతమవుతుందని రైతులు చెబుతున్నారు. రైతులు సార్వా పంట అవగానే దాళ్వా సాగుకు వెనువెంటనే సాగు ఆరంభించడంతో భూమి సారం కోల్పోయి పంట దిగుబడి తగ్గిపోతుందని వేసవిలో దుక్కులు దున్నడం వల్ల భూమి సారవంతమవుతుందని రైతు విశ్లేషకులు చెబుతున్నారు.

పొలాల్లో ఎత్తుపల్లాలను సరిచేసుకుంటున్న రైతులు

సార్వా పంట సమీపించడంతో వేసవి కావడంతో పొలాల్లో ఎత్తు పల్లాలను సరిచేసుకుంటున్నారు. సార్వా పంటలో వరదలు, భారీ వర్షాలు రానున్న నేపథ్యంలో పొలాల గట్లను, ఎత్తు పల్లాలను సరి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

వేసవి దుక్కులు దున్నడం వల్ల రైతన్నకు మేలు



వేసవి దుక్కులు దున్నడం వల్ల పంటలో తెగుళ్ల వ్యాప్తి నివారించవచ్చు. గత పంటలో ఉన్న తెగుళ్ల బీజాలు నిర్మూలించడమే కాకుండా నేల కూడా సారవంతమవుతుంది. పంటలో అధిక దిగుబడి సాధించవచ్చు. మొండి కలుపు మొక్కలు నివారించకోవచ్చు. గత పంటకాలంలో కాండం తొలుచు పురుగు, ముప్పు పురుగు,గొంగళి పురుగులు బయటకు వచ్చి చచ్చిపోతాయి. ఖర్చును కూడా తగ్గించుకోవచ్చు.

– నిమ్మల శ్రీనివాస్, వ్యవసాయాధికారి, భీమవరం మండలం

పిల్లలు ఏకాగ్రత పెంచుకోవాలి

నరసాపురం: పిల్లలు చదువులకు సంబంధించి విషయంలో ఏకాగ్రత పెంచుకోవాలని జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబుఅన్నారు. నరసాపురం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో సాగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లా డారు. విద్యార్థి దశ నుంచే భవిష్యత్‌పై ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. ప్రస్తుతం అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. లైబ్రేరియన్ కేజేఎస్‌ఎల్ కుమారి మాట్లాడుతూ వేసవి శిక్షణా తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయని చెప్పారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

కాళ్ల: పేకాడుతున్న స్థావరం పై దాడి చేసి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం ఏలూరుపాడు గ్రామంలో పడమట సుబ్బయ్యకు చెందిన ఆక్వా చెరువు వద్ద ఉన్న గోడౌన్ వద్ద పేకాట ఆడుతున్నరనే సమాచారం మేరకు కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.22,890 నగదు, 4 సెల్ ఫోన్లు, 3 మోటార్ బైక్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధూమపానంతో ఎన్నో అనర్థాలు



పాలకోడేరులో ధూమపానంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఆకివీడులో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

పాలకోడేరు: ధూమపానం ద్వారా టీబీ వచ్చే అవకాశం ఎక్కువ ఉందని ధూమపానానికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రంగం నాయుడు అన్నారు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బుధవారం ధూమపానంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ధూమపానంతో ఊపిరితిత్తులు పాడవడమే కాకుండా ప్రాణాంతకరమైన టీబీ వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. ఆరుబయట, ప్రభుత్వ కార్యాలయాలు, ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతంలో ధూమపానం చట్ట వ్యతిరేకమన్నారు అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చన్నారు. ధూమపానం గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా గొరగనమూడి గ్రామంలో సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు వైద్యురాలు హాసిత, పీహెచ్‌ఎన్ కుమారి, సూపర్వైజర్లు శంకర్, అయ్యప్ప శ్రీనివాస్ పాల్గొన్నారు

ధూమపానానికి దూరంగా ఉండాలి

ఆకివీడు: ధూమపానం, మద్యపానానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని, వాటికి దూరంగా ఉండేందుకు తల్లిదండ్రుల్ని ప్రోత్సహించాలని అడ్వకేట్ నెల్లి సతీష్ పిలుపునిచ్చారు. స్థానిక శాఖ గ్రంథాలయం వద్ద వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ధూమపానం వల్ల వచ్చే నష్టాలు, ఆరోగ్య సమస్యల్ని ఆయన వివరించారు. బీడీ, సిగరెట్, పొగాకు, ఖైనీ, గుట్కా వంటివి పొగాకు సంబంధిత ఉత్పత్తులని, వాటివల్ల అనర్థాలే ఎక్కువ అని సతీష్ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విజ్ఞాన శిబిరంలో రీడర్స్ ఫోరం అధ్యక్షులు దాసరి వెంకట సత్యనారాయణ, గ్రంథపాలకురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

వీరవాసరం: గ్రామీణ ప్రాంతాలలో డ్వాక్రా గ్రూపుల్ని నడిపిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళుతున్న డ్వాక్రా యానిమేటర్లు సమస్యలు పరిష్కరించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా వీరవాసరంలో ఏపీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పి.రత్నకుమారి, రమణకుమారి, రాజేశ్వరి, మధులత, పుష్ప, శ్రీలక్ష్మీ చంద్రకళ, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ ఆసుపత్రి ఏఆర్టీ సెంటర్లో రోగులకు పండ్లు, విసినకర్రలు ఉచిత పంపిణీని బుధవారం జిల్లా సర్వోదయమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఏపీ శాక్స్ డీడీ డాక్టర్ ఫ్లోరెన్స్ మాట్లాడుతూ రోగులను ఆదుకోవడం మానవ ధర్మమని మా వైద్య సేవలతో పాటు దాతలు ఇలా సహకరిస్తే రోగలకు ఉపశమనంగా ఉంటుందని దాతలను అభినందించారు. డాక్టర్ అల్లం రమేష్ , ఏఆర్టీ సెంటర్ డైరెక్టర్ ఎం.గోవిందబాబు మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో ఎండలు విపరీతంగా ఉన్నాయని ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లా సర్వోదయమండలి కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతి వేసవికాలంలో ప్రభుత్వాసుపత్రిలో మా పరిధిలో కొన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ నిర్మల జ్యోతి ఆర్థిక సహకారంతో వందమందికి మామిడిపళ్లు విసినకర్రలు ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు. భీమవరం పట్టణ లయన్స్ క్లబ్ కార్యదర్శి నరహరిశెట్టి కృష్ణ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాంబాబు, జేడీసీ ఎస్టీ సుబ్రహ్మణ్యం , పీఈ పి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పీవీఎల్

ఉండి: స్థానికంగా కనకదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణానికి బుధవారం డిసిసిబి ఛైర్మన్ పీవీఎల్ నరసింహారాజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయనతో పాటు క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, ఎంపీపీ శ్రీహరి నారాయణరాజు, జడ్పీటీసి రణస్తుల కనకదుర్గ, సర్పంచ్ సౌజన్య పాల్గొన్నారు. కాగిత మాతయ్య ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

హెడ్ కానిస్టేబుల్ సేవలు అభినందనీయం

పెనుగొండ: పెనుగొండ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ వి.శ్రీనివాసరావు సేవలు అభినందనీయమని సిఐ జీవీవీ నాగేశ్వరరావు అభినందించారు. పెనుగొండ నుంచి ఇరగవరం స్టేషన్‌కు బదిలీపై వెళుతున్న వీ శ్రీనివాసరావును బుధవారం ఘనంగా సత్కరించారు. పలు కీలక కేసుల దర్యాప్తులో సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామపురంలో వలంటీర్లకు సన్మానం



శ్రీరామపురంలో వలంటీర్లను ఘనంగా సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ప్రభుత్వం, ప్రజలకు మధ్య అవినీతి అక్రమాలు లేకుండా సంక్షేమ ఫలాలు అందించడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని వలంటరీ వ్యవస్థను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు హర్షం చేస్తున్నారని సర్పంచ్ కలిదిండి సుజాత అన్నారు. భీమవరం మండలంలోని శ్రీరామపురం గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా బుధవారం సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను వలంటీర్లకు ప్రధానం చేస్తూ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కలిదిండి సుజాత మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన అన్న విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వలంటరీ వవస్థను తీసుకువచ్చారని ఈ వ్యవస్థ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడంతో విజయవంతం కావడంతో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మన రాష్ట్రంవైపు చూస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్నో పనులు మానుకుని జన్మభూమి కమిటీలు, మండలాపీసులు చుట్టూ కాళ్ల అరిగేలా లబ్ధిదారులు తిరిగేవారన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు ఇంటి ముంగిటకే రావడంతో ప్రజలు జగన్ పాలన పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. అనంతరం వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కలిదిండి ఫణిరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ రహదారికి దాతల దాతృత్వం



వడలిలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న దాతలు

పెనుగొండ: వడలిలోని జగనన్న కాలనీ రహదారికి అవసరమైన స్థలాన్ని వడలి సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, చిన్నంవారి పాలేనికి చెందిన నల్లిమిల్లి విజయ భాస్కరరెడ్డిలు వారి సొంత పొలం నుంచి 20 అడుగుల వెడల్పులో 280 అడుగుల పొడవున అవసరమైన స్థలాన్ని అందించారు. వడలి ఎస్సీ కాలనీ వద్ద జగనన్న కాలనీ నిమిత్తం మూడు ఎకరాల భూమిని సేకరించి 123 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. అయితే రహదారి సమస్య తలెత్తడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషితో సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, నల్లిమిల్లి విజయ భాస్కరరెడ్డిలు స్థలాన్ని రహదారి కోసం ఇవ్వడానికి అంగీకరించి ధ్రువీకరణ పత్రాలను బుధవారం అందించారు. దాతలకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, ఎంపీటీసీలు రెడ్డి గణేశ్వరరావు, చిటికెన దుర్గాభవానీ నాగేంద్రప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు కాసాని శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తమరాని సత్యనారాయణ, వెలగన మందయ్య, బొల్లా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ



ఆగర్రు గ్రామ సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కేసీహెచ్ అప్పారావు

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను గ్రామ సచివాలయంలో ప్రజలందరికీ తెలిసేలా ప్రదర్శించాలని డీఎల్‌డీఓ, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ప్రత్యేకాధికారి కేసీహెచ్ అప్పారావు కోరారు. పాలకొల్లు మండలం ఆగర్రు, ఆగర్తిపాలెం, సగంచెరువు గ్రామ సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆగర్రు సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. 0 నుంచి ఐదేళ్ల ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయించాలన్నారు. పుట్టిన తేదీ ధ్రువపత్రం జత చేసి, ఆధార్ నమోదు చేస్తారన్నారు. ప్రతీ రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని, అలాగే ఆ సమయంలో ఉద్యోగులంతా కార్యాలయంలో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు. సచివాలయంలో అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతీ బుధవారం సచివాలయంలో కార్యదర్శి అధ్యక్షతన సమావేశం నిర్వహించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు వెళ్లి వివరించాలని సూచించారు. ప్రతీ ఉద్యోగి విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సిటిజన్ ఔట్రిచ్, పాల వెల్లువ సర్వే కార్యక్రమాల్ని వలంటీర్ల ద్వారా సకాలంలో పూర్తి చేయించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బందితో అనుసంధానంగా ఉండి పనులు పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ షేక్ అమీర్, పంచాయతీ కార్యదర్శులు ఆనందబాబు, కె.బులిరాజు తదితరులు ఉన్నారు.

భీమవరం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో ఇ.పి.నెం.9/2017 ఎలయిజ ఒ.ఎస్.నెం.247/2015

డి.హెచ్‌ఆర్ : దాళ్వేపల్లి వాని చంద్ర కుమార్ తండ్రి: కీ॥శే॥ ఐబరీ నారాయణ, డోర్.నెం.2–104, కొమరాడ, భీమవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

జె.డి.ఆర్ : కొరశాల శ్రీనివాస్ తండ్రి నాగేశ్వరరావు, డోర్. నెం. 2–143/2, అనాకోడేరు, భీమవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

డి.హెచ్.ఆర్ దాఖలు చేసిన వేలం ప్రకటన

పై నెంబరు ఇ.పి. ఆమలు క్రిందంలో డిక్రీ బాకీ వారం టు సొమ్ము రాబట్టు కొరకుటు గాను జె.డి.ఆర్ యొక్క సంపూర్ణ స్వాధీన అనుభవ హక్కు భుక్తములో ఉన్న ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థి ది.ది. 30–06–2023 వ సంవత్సరం తేదిన ఉదయం 10–30 ని.లకు పై కోర్టు వారి ఎదుట వేలం వాబడగలదని, కావలసినవారు వచ్చి వేలం పాటలో పాల్గొనవలెను. సదిగా యుండు ముందుగా తెలియపరచడమైనది

షెడ్యూలు: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం, భీమవరం సబ్ రిజిష్ట్రార్ పరిధిలో అనాకోడేరు గ్రామం తాలూకా డోర్.నెం.2–142/1 లో గల య.0–03 సెంట్ల భూమిన్ని దానిలో గల ఆర్‌సిసి బిల్డింగ్‌తో సహా హద్దులు: తూర్పు: గంగుల వెంకటేశ్వరరావు గారి ఇల్లు, దక్షిణం: కొరశాల సత్యనారాయణ గారి ఇల్లు, పడమర: కంచుల బీకయ్య, ఉత్తరం: పంచాయి చెరువు.

డిహెచ్.ఆర్.వేల్యూ : రూ.2,17,500/-

అమీనా వాల్యూ : రూ.4,00,000/- శ్రీ రామపురం, భీమవరం -2, ప.గో.జిల్లా, సెల్: 8849121888

భీమవరం
తేది: 31–05–2023

పి.నరసింహం బి.ఎస్సి.ఎల్ యు.బి.వెంకన్న ఎమ్.ఏ.,బి.ఎల్.,
అడ్వకేట్లు

పాపాన్ని ఒప్పుకోవడమే రక్షణ



ఏసుక్రీస్తు రక్షణ మహాసభల్లో మాట్లాడుతున్న సభల కన్వీనర్ తంగెళ్ల ఆనందరాజు

పాలకోడేరు: ఆదాము అవ్వ దేవుని ఆజ్ఞ మీరడం వల్ల పాపము సంభవించిందని, క్రీస్తు వల్ల రక్షణ కలిగిందని రాజమండ్రి కి చెందిన ప్రసంగికులు ఆంద్రూస్ బత్తుల ఉపదేశించారు. మైప కాలనీ మైదానంలో జరిగిన ఏసుక్రీస్తు రక్షణ సువార్త మహాసభలు బుధవారం రాత్రి తో ముగిశాయి. హైదరాబాద్ కు చెందిన ప్రసంగీకులు ఆర్.వంశీ మాట్లాడుతూ మనిషి రూపంలో భూలోకానికి వచ్చావని నీ పుట్టుక క్రీస్తు ఎరుగునని కాబట్టి ఆయన మార్గంలో నడవాలన్నారు చిలకలూరిపేటకు చెందిన క్రీస్తు పరిచారకులు షేక్ ప్రభు కిరణ్ మాట్లాడుతూ మనిషి పాపాన్ని వదిలి వారు మనసు పొందారన్నారు. తొలుత సువార్త మహాసభలను గరగపర్రు ప్యారిస్ పాస్టర్ రెవరెండ్ వై.జయరాజు ప్రారంభించారు. ఆరాధన, నిర్వహించి దేశం రాష్ట్రం గ్రామం కోసం ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. క్వయర్ ఆలపించిన గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సభలు అనంతరం మూడు రోజులపాటు అందరికి భోజనాలు ఏర్పాటు చేశారు. సభల కన్వీనర్ తంగెళ్ల ఆనందరాజు మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి ప్రతి ఏడాది ఈ సువార్త మహాసభలను నిర్వమిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూపీఏ మండల అధ్యక్షుడు గోపే సాల్మన్ రాజు, బలే కృస్టాపర్, సువార్త గాయకులు డి ఆశీర్వాదం, గరికి జాషువా, వి.అమూల్య సేవకులు టైటస్ కొండేటి జి.రమేష్ బాబు, లూథరన్ చర్చ్ సంఘ కాపరి ఆర్.రవి కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలి



సోమేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: భక్తిభావాన్ని పెంపొందించేందుకు దేవాలయాలు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని వేములదీవి వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మండపం ప్రారంభోత్సవం, ఎల్బీచర్లలోని శ్రీశ్రీశ్రీ పార్వతీ సోమేశ్వర స్వామివారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. సుమారు 200 ఏళ్ల నాటి చరిత్ర కలిగిన సోమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. అలాగే వేములదీవి వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పసలదీవి గ్రామంలోని వరసిద్ధి వినాయ స్వామి వారి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో కూడా ప్రసాదరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్, మండల అధ్యక్షులు దొంగ మురళీకృష్ణ, తిరుమాని నాగరాజు, గుబ్బల భాను, అయ్యారి కృష్ణమోహన్, కంచర్ల రామకృష్ణ, సంగాని వడ్డికాసులు, బాబూరావు, గుబ్బల మోహనరావు, పులపర్తి త్రిమూర్తులు, కొట్టు ఏడుకొండలు, పులపర్తి రంగారావు, కొట్టు వెంకట్రావు, మామిడిశెట్టి శ్రీను, కాండ్రేగుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దానమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



దానమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మండలంలోని ఎస్.ఇల్లిందలపర్రు గ్రామంలో కోటి రూపాయల వ్యయంతో పునర్నిర్మించే శ్రీ దానమ్మవారి దేవాలయం పునర్నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్, కామర్స్ డిపార్ట్‌మెంట్ ఎడ్వైజర్ వెలగల నవభరత్ రెడ్డి, వాణి దంపతులు బుధవారం శంకుస్థాపన చేశారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన దానమ్మవారి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహకారంతో వెలగల శివాజీరెడ్డి, సూర్యావతి దంపతులు రూ.10 లక్షలు తొలి విరాళం ఇవ్వగా గ్రాస్తులు సుమారు 90లక్షల వరకూ విరాళాలు సేకరించి ఈ నిర్మాణానికి స్వీకారం చుట్టారు. ఉదయం ఆలయ నిర్మాణ ఆవరణలో శంకుస్థాపన అనంతరం హోమపూజలు, శాంతిపూజలు ఘనంగా నిర్వహించారు. పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పెనుగొండ సీఐ జీవీ నాగేశ్వరరావు, పెనుమంట్ర ఎస్సై వి.సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.